# జీఎస్టీ వసూళ్లు ఆల్‌టైమ్ హై




ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, మే 1: జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.2.10 లక్షల కోట్లతో పోలిస్తే 12.6 శాతం అధికమని పేర్కొంది. జీఎస్టీ అమలులోకి వచ్చిన జూలై 1, 2017 తర్వాత ఇదే అత్యధిక వసూళ్లు కావడం విశేషం. ఈ ఏడాది మార్చి నెలలో రూ.1.96 లక్షల కోట్లు వసూలయ్యాయి. గడిచిన నెలలో వసూలైనదాంట్లో దేశీయంగా రూ.1.96 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే 10.7 శాతం మేర పెరిగాయి. వీటిలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.48,634 కోట్లు వసూలవగా, స్టేట్ జీఎస్టీ కింద రూ.59,372 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ.69,504 కోట్లు, సెస్ రూపంలో రూ.12,293 కోట్లు వసూలయ్యాయి. దేశ ఆర్థిక రంగం బలంగా ఉందన్నడానికి ఈ జీఎస్టీ వసూళ్లే నిదర్శనమని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే పన్ను వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మైలురాయి దాటిందని డెలాయిట్ ఇండియా పార్టనర్ ఎంఎస్ మణి తెలిపారు. అత్యధిక ఉత్పత్తి, వినిమయ రాష్ట్రాల్లో జీఎస్టీ వసూళ్లలో వృద్ధి 11 శాతం నుంచి 16 శాతం మధ్యలో నమోదవడం వల్లనే రికార్డు స్థాయికి చేరుకున్నాయన్నారు.

**ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు**

| | |
|---|---|
| ఏప్రిల్ 2025 | రూ.2.37 లక్షల కోట్లు |
| ఏప్రిల్ 2024 | రూ.2.10 లక్షల కోట్లు |
| మార్చి 2025 | రూ.1.96 లక్షల కోట్లు |

# వాహన విక్రయాలు అంతంతే

న్యూఢిల్లీ, మే 1: మార్కెట్ పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉన్నప్పటికీ గడిచిన నెలలో వాహన విక్రయాలు ఆశించిన స్థాయిలో నమోదయ్యాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలు మారుతి సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా విక్రయాలు పెరగగా..టాటా మోటర్స్, హ్యుందాయ్ సేల్స్ తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ మహీంద్రా రెండో స్థానానికి, టాటా మోటర్స్ మూడో స్థానానికి ఎగబాకింది. కానీ, రెండో స్థానంలో కొనసాగిన హ్యుందాయ్ ఈసారి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నది. మారుతి అమ్మకాలు ఏడు శాతం అధికమయ్యాయి.

**ఏప్రిల్ నెలలో వాహన అమ్మకాలు**

| సంస్థ | 2025 | 2024 | వృద్ధి(శాతంలో) |
|---|---|---|---|
| మారుతి | 1,79,791 | 1,68,089 | 7 |
| మహీంద్రా | 84,170 | ==== | 19 |
| టాటా మోటర్స్ | 72,753 | 77,521 | -6.1 |
| హ్యుందాయ్ | 60,774 | 63,701 | -5 |
| టయోటా కిర్లోస్కర్ | 27,324 | 20,494 | 33 |
| ఎంజీ మోటర్స్ | 5,829 | 4,725 | 23 |
| కియా ఇండియా | 23,623 | 19,968 | 18 |
| హోండా కార్స్ | 3,360 | 4,351 | -23 |
| ద్విచక్ర వాహనాలు | | | |
| టీవీఎస్ మోటర్ | 4,43,896 | 3,83,615 | 16 |
| సుజుకీ మోటర్‌సైకిల్ | 1,12,948 | 99,377 | 14 |
| రాయల్ ఎన్‌ఫీల్డ్ | 86,559 | 82,043 | 6 |

# హైదరాబాద్ ఆఫీస్ ఖాళీ

## వృథాగా 284 లక్షల చదరపు అడుగుల్లో కార్యాలయ స్థలాలు


### దేశంలోనే అత్యధికం.. ఆ తర్వాత ఢిల్లీ-ఎన్‌సీఆర్

### అద్దెకు పెద్దగా ఆసక్తి చూపని కార్పొరేట్లు: వెస్టియన్

*ఈ నగరానికి ఏమైంది. అవును.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను చూస్తే ఇలాంటి ప్రశ్నలే తలెత్తుతున్నాయిప్పుడు.*

*ఒకప్పుడు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయిన ఆఫీస్ స్పేస్.. ఇప్పుడు ఆదరణ లేక కళావిహీనంగా కనిపిస్తున్నది. అద్దెకు తీసుకునేవారే కరువైపోయారు మరి.*

*గతంలో ఇక్కడ కార్యాలయాలను ఏర్పాటు చేసుకొనేందుకు క్యూ కట్టిన కార్పొరేట్లు.. ప్రస్తుతం ముఖం చాటేస్తున్నారు. దీంతో లక్షల చదరపు అడుగుల్లో కార్యాలయ స్థలాలు ఖాళీగా ఉన్నాయంటూ రియల్ ఎస్టేట్ రిపోర్టులు వస్తున్నాయి.*



**బీఆర్ఎస్ హయాంలోనే బాగుబాగు**

ఉమ్మడి రాష్ట్రంలో నత్తనడకన సాగిన అభివృద్ధి.. విభజన అనంతరం తెలంగాణలో పరుగులు పెట్టింది. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలు అన్ని రంగాలను బలపర్చాయి. ఐటీ, ఫార్మా, ఆటో, ఏవియేషన్, డిఫెన్స్ ఇలా కీలక రంగాలు వృద్ధిపథంలో పయనించాయి. ఇది ఇక్కడి నిర్మాణ రంగానికి ఊహించని స్థాయిలో డిమాండ్‌ను తెచ్చిపెట్టింది. ముఖ్యంగా ఆఫీస్ స్పేస్‌కు గిరాకీని అమాంతం పెంచేసింది. దేశ, విదేశీ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు భారీగా ముందుకొచ్చాయి. భారత్‌లోకి రావాలంటే హైదరాబాద్‌నే ప్రధాన కేంద్రంగా చేసుకోవాలన్నంతగా డిమాండ్ నెలకొన్నదంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఈ క్రమంలోనే మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి అనేక సంస్థలు హైదరాబాద్‌లో బడాబడా ఆఫీసులను తీసుకొచ్చాయి. మరెన్నో స్టార్టప్‌లూ కొలువుదీరాయి. ఫలితంగా ఆఫీస్ మార్కెట్ వేగంగా విస్తరించింది. దాదాపు పదేండ్ల టీఆర్ఎస్, బీఆర్ఎస్ పాలనలో ఇలాగే సాగిందంతా. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అంతా తలకిందులైంది. ఏడాదిన్నరగా పెట్టుబడులు రాక మార్కెట్‌లో స్తబ్ధత నెలకొన్నది. అందుకు ఆఫీస్ స్పేస్ మార్కెట్ అద్దం పడుతున్నది.

- *దేశంలోని ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఆఫీస్ స్పేస్ ఖాళీలు. ఆ తర్వాత ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఉన్నాయి.*
- *బెంగళూరు (2,805 లక్షల చదరపు అడుగులు) తర్వాత ఎక్కువగా ఆఫీస్ స్పేస్ అందుబాటులో ఉన్నది హైదరాబాద్ (1,620 లక్షల చదరపు అడుగులు)లోనే.*
- *బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో జోరుగా డిమాండ్-సప్లై. ఇప్పుడు డిమాండ్ లేకపోవడంతో సప్లై కూడా ఆగిపోయింది.*
- *ఈ ఏడాది జనవరి-మార్చిలో దేశీయంగా ఆఫీస్ స్పేస్ లీజింగ్ 34 శాతం పెరిగి 179.6 లక్షల చదరపు అడుగులకు చేరిక.*
- *జీసీసీలు, ఐటీ, ఐటీ అనుబంధ రంగాలు, బ్యాంకింగ్, ఆర్థిక, బీమా రంగాల నుంచి కనిపించిన డిమాండ్.*

న్యూఢిల్లీ, మే 1: హైదరాబాద్‌లో కార్యాలయ స్థలాలకు పెద్దగా ఆదరణే లేకుండాపోయింది. ఒకప్పుడు దేశంలోని ప్రధాన నగరాలను వెనక్కినెడుతూ ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో దూసుకుపోయిన రాష్ట్ర రాజధాని నగరానికి ఇప్పుడు డిమాండ్ కనిపించడం లేదు. ఏడాదిన్నర క్రితం వరకు హైదరాబాద్‌లో ఆఫీస్‌ను ఏర్పాటు చేసేందుకు ఉత్సాహం చూపిన కార్పొరేట్లు.. ప్రస్తుతం ఆసక్తి చూపించడం లేదు. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ విడుదల చేసిన తాజా గణాంకాలే ఇందుకు నిదర్శనం.

**284 లక్షల చదరపు అడుగుల్లో..**

దేశంలోని 7 ప్రధాన నగరాల ఆఫీస్ స్పేస్ మార్కెట్‌పై వెస్టియన్ సర్వే చేసింది. దీని వివరాల ప్రకారం హైదరాబాద్‌లోనే గరిష్ఠంగా కార్యాలయ స్థలాలు వృథాగా పడిపోయి ఉన్నట్టు తేలింది. ఏకంగా 284 లక్షల చదరపు అడుగుల్లో ఆఫీస్ స్పేస్ ఖాళీగా ఉన్నదని వెస్టియన్ ఈ సందర్భంగా వెల్లడించింది. ఈ ఏడాది మార్చి నాటికి హైదరాబాద్‌లో మొత్తం అందుబాటులో ఉన్న ఆఫీస్ స్పేస్ 1,620 లక్షల చదరపు అడుగులు. ఇందులో 284 లక్షల చదరపు అడుగులు ఖాళీగానే ఉన్నది. ఇది మొత్తం స్టాక్‌లో 17.5 శాతానికి సమానం. కార్పొరేట్ కంపెనీలు అద్దెకు తీసుకొనేందుకు పెద్దగా ఆసక్తి చూపట్లేదని వెస్టియన్ పేర్కొన్నది. కాగా, గతంలోనూ ఆయా నగరాల్లో ఆఫీస్ స్పేస్ ఖాళీలుండేవి. అయితే హైదరాబాద్‌లో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపించేది. దాంతో ఆఫీస్ స్పేస్ గిరాకీలో నగరం ఎప్పుడూ టాప్‌లో ఉండేది. మిగతా నగరాలతో పోల్చితే లీజింగ్ పెద్ద ఎత్తున జరిగేది మరి. కానీ మారిన పరిస్థితులతో ఇప్పుడు ఖాళీల్లో టాప్‌లో ఉంటున్నది.

**ఆగిన కొత్త నిర్మాణాలు**

ఇప్పటికే నిర్మాణం పూర్తయ్యి అందుబాటులో ఉన్న ఆఫీస్ స్పేస్‌కు గిరాకీ అంతంత మాత్రంగానే ఉండటంతో కొత్త నిర్మాణాలు దాదాపుగా ఆగిపోయాయి. రియల్టర్లు, ఆఫీస్ స్పేస్ నిర్మాణ కంపెనీలు నూతన ప్రాజెక్టులకు దూరంగా ఉంటున్నాయి. ఫలితంగా సిమెంట్, ఉక్కు, ఇతర నిర్మాణ అనుబంధ రంగాలు కుదేలయ్యాయి. వాటిమీద ఆధారపడుతున్న పరిశ్రమలు, వ్యాపారులు, ఉద్యోగులు, కూలీల భవిష్యత్తు ఆందోళనలో పడింది. నిజానికి హైదరాబాద్‌లో ఖాళీగా ఉన్న కార్యాలయ స్థలాలు మునుపు ఇంకా ఎక్కువ (19 శాతం)గానే ఉండేవి. కానీ కొత్త ప్రాజెక్టులు రాకపోవడంతో ఇవి కాస్త తగ్గాయి. కాగా, హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, పుణె నగరాలపై వెస్టియన్ సర్వే చేసింది.

**దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఖాళీ ఆఫీస్ స్పేస్ నిల్వలు**

| నగరం | లక్షల చ.అడుగుల్లో |
|---|---|
| హైదరాబాద్ | 284 |
| ఢిల్లీ-ఎన్‌సీఆర్ | 232 |
| బెంగళూరు | 210 |
| ముంబై | 125 |
| కోల్‌కతా | 79 |
| చెన్నై | 60 |
| పుణె | 56 |

## కాగ్నిజెంట్‌లో 20 వేల ఉద్యోగాలు

న్యూఢిల్లీ, మే 1: అమెరికాకు చెందిన ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్..ప్రస్తుతేడాది 20 వేల మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్టు ప్రకటించింది. కృత్రిమ మేధస్సుతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై మంచి పట్టున్న ఉద్యోగులను రిక్రూట్ చేసుకోనున్నది. నూతన టెక్నాలజీ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్టు, గతేడాది రిక్రూట్ చేసుకున్నవారి కంటే రెండింతలు అధికంగా ఈసారి నియమించుకోనున్నట్టు కాగ్నిజెంట్ సీఈవో రవి కుమార్ ఎస్ తెలిపారు. ప్రస్తుతం సంస్థలో 3,36,300 మంది ఉద్యోగులు ఉన్నారు.

## దిగొస్తున్న బంగారం ధర

### హైదరాబాద్‌లో తులం రూ.2,180 డౌన్ • 24 క్యారెట్ రూ.95,730

హైదరాబాద్, మే 1: నిన్నమొన్నటిదాకా ఆకాశమే హద్దుగా పరుగులు పెట్టిన బంగారం ధరలు.. ఇప్పుడు అంతే వేగంగా దిగొస్తున్నాయి. గురువారం ఒక్కరోజే హైదరాబాద్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల రేటు రూ.2,180 తగ్గి రూ.95,730 వద్ద స్థిరపడింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం విలువ కూడా రూ.2,000 పడిపోయి రూ.87,750 వద్ద నిలిచింది. నిజానికి గత వారం రోజులుగా గోల్డ్ రేట్లు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. అంతకుముందు తులం రేటు తొలిసారి లక్ష రూపాయల మార్కును దాటిపోయిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలు, వివిధ కారణాలతో పతనమైన స్టాక్ మార్కెట్ల వల్ల దేశీయ మార్కెట్‌లో పుత్తడి ధరలు వరుసగా పెరుగుతూపోయాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వస్తున్న బలహీన సంకేతాల నడుమ ధరలు దిగువ ముఖం పడుతున్నాయి.






## లోహియా బిస్కెట్ ప్లాంట్

హైదరాబాద్, మే 1: హైదరాబాద్‌కు సమీపంలో మేడ్చల్ వద్ద వరల్డ్ క్లాస్ బిస్కెట్ తయారీ యూనిట్‌ను ప్రారంభించింది లోహియా గ్రూపు. ఏడు ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో ప్రస్తుతం నెలకు 1000 టన్నుల బిస్కెట్లు తయారుకానుండగా, వచ్చే నాలుగేండ్లలో ఈ సామర్థ్యాన్ని 5 వేల టన్నులకు పెంచుకోనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వచ్చే నాలుగేండ్లలో రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించింది.

## హైదరాబాద్‌లో ఆల్ట్.ఎఫ్ కో-వర్కింగ్ ఆఫీస్

హైదరాబాద్, మే 1: కో-వర్కింగ్ నిర్వహణ సంస్థ ఆల్ట్.ఎఫ్..హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని తెరిచింది. 56 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 1,200 మందికి పైగా కూర్చోవడానికి వీలుంటుందని పేర్కొంది. సౌకర్యవంతమైన కార్యాలయాల మార్కెట్ భారీ వృద్ధిని నమోదు చేసుకుంటున్న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని కంపెనీ కో-ఫౌండర్ యోగేశ్ అరోరా తెలిపారు. ఒక్కో డెస్క్ నెలకు రూ.8 వేల చొప్పున చార్జీ వసూలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం సంస్థ..ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్‌లలో కో-వర్కింగ్ కార్యాలయాలను నిర్వహిస్తున్నది.

## శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి


ఆసిఫాబాద్ టౌన్ , మే 1: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని డీవైఎస్‌వో ఆర్ రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని జిల్లా గిరిజన క్రీడాధికారి మీనా రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లా యువజన క్రీడ శాఖ ఆధ్వర్యంలో మే 1 నుంచి జూన్ 6 వరకు జిల్లా లో వివిధ మండలాల్లో 10 క్రీడాంశాలలో వేసవి క్రీడా శిక్షణాలు కేంద్రాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు పరిమితం కాకుండా క్రమశిక్షణతో ఆటలు ఆడి, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో క్యాంపు ఇన్‌చార్జి తిరుపతి, కోచస్ విద్యాసాగర్, అరవింద్, రవీందర్, రాకేష్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కౌటాల, మే 1 : జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని కౌటాల, ముత్తంపేట, గుండాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు ప్రారంభిస్తున్నట్లు ఎంఈవో గావుడే హన్మంతు తెలిపారు. ఈ నెల 1 నుంచి 15వ తేది వరకు ఈ సమ్మర్ క్యాంపు కొనసాగనున్నట్లు, ఇందులో యోగా, కరాటే, డ్యాన్స్, ఇండోర్ గేమ్స్, డ్రాయింగ్, పేయింట్ లాంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపుకోసం ప్రతి పాఠశాలకు నలుగురు వలంటీర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. హెచ్‌ఎంలు గోడం నానాజీ, నారాయణ సింగ్, ఉపాధ్యాయులున్నారు.

కెరమెరి, మే 1: మండలంలోని గోయగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ఆడే ప్రకాశ్ అన్నారు. గురువారం సీనియర్ ఉపాధ్యాయుడు ఎన్. రమేశ్‌తో కలిసి సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 15 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో ఆసక్తి గల విద్యార్థులు తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సంగీతం, డ్యాన్స్, యోగా, కరాటే, గేమ్స్, స్పోర్ట్స్‌పై శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సంబంధిత విభాగంలో నైపుణ్యం పెంపొందించుకునేలా ప్రతి విద్యార్థి కృషి చేయాలని తెలిపారు.

పెంచికల్ పేట్, మే 1 మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి 15 రోజులుగా నిర్వహించనున్న సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల అన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ శ్యాంసుందర్, వలంటరీలు ప్రవీణ్, పావని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉన్నత చదువుల్లో రాణించాలి



టాపర్ గీతాంజలిని సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ, నాయకులు

కెరమెరి, మే 1: పదవ తరగతి ఫలితాల్లో 530 మార్కులు సాధించి, మండల టాపర్‌గా నిలిచిన గీతాంజలి మరింత ఉన్నత చదువుల్లో రాణించాలని మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడవి భరత్ భూషణ్ అన్నారు. గురువారం మండలంలోని చిన్న సాకడ గ్రామంలో ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు సెడ్మకి తుకారాం, నాయకులు పెందోర్ శ్రీనివాస్, సిడం భీంరావు, కినక సక్కారాం, ఆడ ఆనంద్, వెంకట్, భుజంగ్, రాంశావు, భీంరావు తదితరులు ఉన్నారు.

## 5 నుంచి దరఖాస్తుల పరిశీలన

కౌటాల, మే 1 : రాజీవ్ యువ వికాసంలో పథకంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేయనున్నట్లు ఎంపీడీవో రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకుని ఎంపీడీవో కార్యాలయంలో హాజరు కావాలని ఆయన సూచించారు.

# కరెంటు తీగ మాయంపై సా...గుతున్న విచారణ

- ఏడీఈ, ఏఈలను వివరణ కోరిన ఉన్నతాధికారులు
- చిన్న ఉద్యోగిని బలిపశువు చేసేందుకు యత్నాలు ?



మంచిర్యాలలోని విద్యుత్‌శాఖ జిల్లా స్టోర్స్

మంచిర్యాలటౌన్, మే 1: మంచిర్యాలలోని పాతమంచిర్యాలలో ఉన్న విద్యుత్ శాఖ జిల్లా స్టోర్స్ నుంచి కరెంటు తీగ (కండక్టర్) మాయమైన అంశంపై విచారణ కొనసాగుతున్నది. ఈ విషయంలో స్టోర్స్ ఏడీఈ, ఏఈ, దహెగాం మండలాల ఏఈల వివరణ ఇవ్వాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. వీరినుంచి అందిన వివరణ అనంతరం సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అయితే కరెంటు తీగ మాయం అవడానికి సంబంధించిన అంశంతో ముడిపడి ఉన్న అధికారులకు ఉన్నతాధికారుల అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో వారిని ఈ అంశంలో నుంచి తప్పించి చిరు ఉద్యోగి అయిన వాచ్‌మెన్‌ను బలిపశువును చేయాలని పావులు కదుపుతున్నట్లు సమాచారం. . కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలో విద్యుత్ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ మంచిర్యాలలోని జిల్లా స్టోర్స్ నుంచి 2023 జనవరి 20న సామగ్రిని తీసుకువెళ్లాడు. ఆ సమయంలో తనకు ఇవ్వాల్సిన సామగ్రి వాహనంలో పట్టకపోవడం మూలంగా 20 కిలో మీటర్ల కరెంటు వైరును స్టోర్స్‌లోనే ఉంచి వెళ్లినట్లు కాంట్రాక్టర్ చెబుతున్నాడు. 2024 మార్చి నెలలో తనకు సంబంధించిన సామగ్రి జిల్లా స్టోర్స్‌లోనే ఉందని చెప్పడంతో ఇక్కడి అధికారులు అలాంటిదేం లేదని, అంతా అప్పుడే ఇచ్చామని తేల్చిచెప్పారు. జిల్లా స్టోర్స్ నుంచి సంబంధిత కాంట్రాక్టర్ పూర్తి సామగ్రిని తీసుకువెళ్లాడని, అందుకు సంబంధించి రిజిస్టర్‌లో సంతకం కూడా చేశాడని అధికారులు చెబుతున్నారు. ఈ విషయం కాస్త సంస్థ సీఎండి దృష్టికి వెళ్లగా ఆయన సమగ్ర విచారణ జరపాల్సిందిగా ఆదేశించారు. వరంగల్‌కు చెందిన డీఈ స్థాయి అధికారి ఒకరు ఫిబ్రవరి నెలలో ఇక్కడి జిల్లా స్టోర్స్‌కు వచ్చి విచారణ జరిపారు. తాము కాంట్రాక్టర్‌కు సామగ్రిని అంతా ఇచ్చేశామని అధికారులు అందుకు సంబంధించిన సాక్ష్యాలను చూపించినట్లు తెలుస్తున్నది. దహెగాం మండలంలో విద్యుత్ అభివృద్ధి పనులకు సంబంధించి నెలలు గడుస్తున్నా పురోగతి కనిపించక పోవడంతో అనుమానం వచ్చిన అధికారులు ఈ మేరకు విచారణ జరిపారు. దీంట్లో భాగంగానే సంబంధిత కాంట్రాక్టర్‌ను వారు అడగగా తనకు రావాల్సిన సామగ్రి స్టోర్స్ ఉందని చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. 20 కిలోమీటర్ల 32కేవి లైన్ కరెంటు తీగ విలువ సుమారుగా రూ.15 లక్షల వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గందరగోళంగా మారిన ఈ అంశంపై ఉన్నతాధికారులు ఏం నిర్ణయం తీసుకుంటారోనని సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.




చెన్నూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## అర్ధరాత్రి బీఆర్ఎస్ జెండాలు, ఫ్లెక్సీల తొలగింపు

- మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

చెన్నూర్, మే 1: మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలో బీఆర్ఎస్ జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలను అర్ధరాత్రి మున్సిపాలిటీ అధికారులు తొలగించడాన్ని నిరసిస్తూ గురువారం చెన్నూర్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట గురువారం బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగి ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకుడు రాజారమేశ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ కమిషనర్ మురళీకృష్ణ ఎమ్మెల్యేకు తొత్తుగా వ్యవహరిస్తూ పట్టణంలో తమ పార్టీ ఏర్పాటు చేసిన తోరణాలను, ఫ్లెక్సీలను తొలగించారని, కొన్నింటిని చింపారని ఆరోపించారు. కొద్ది రోజుల క్రితం రజతోత్సవ సభకు సంబంధించిన గోడ రాతలను మున్సిపల్ కమిషనర్ సున్నం వేసి తుడిచి వేయించారని తెలిపారు. ఇదే విధంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీల ఫ్లెక్సీలు, జెండాలను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రేమ ఉంటే కమిషన్ పదవికి రాజీనామా చేసి ఆ పార్టీలో కార్యకర్తగా పని చేయాలని హెచ్చరించినా ఆయన తీరు మారడం లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జెండా తోరణాలు, ఫ్లెక్సీలను తొలగించినట్లుగా ఇతర పార్టీల జెండాలు, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంత్రి బాపు, మాజీ జడ్పీటీసీ మోతె తిరుపతి, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, మాజీ కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, జోడు శంకర్, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, మేడ సురేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న అంబేద్కర్ సంఘం నాయకులు


## అంబేద్కర్ సంఘం నాయకుల ఆందోళన

చెన్నూర్, మే 1: మున్సిపాలిటీ కమిషనర్ మురళీకృష్ణ తీరుకు నిరసనగా చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట గురువారం అంబేద్కర్ సంఘం నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ , రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా విగ్రహం చుట్టూ కట్టిన అంబేద్కర్ జెండాలను మున్సిపాలిటీ కమిషనర్ కళేబరాలు తరలించే చెత్త వాహనంలో డంపింగ్ యార్డుకు అవమానకరమైన రీతిలో తరలించారని ఆరోపించారు. ఇలా అంబేద్కర్‌ను అవమానపర్చిన మున్సిపాలిటీ కమిషనర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు రేవెల్లి మహేశ్, తగరం చిరంజీవి, తిరుపతి సురేశ్, తగరం అశోక్, దుర్గా ప్రసాద్, మోతె గోపాల్ పాల్గొన్నారు.

## 7న జాబ్ మేళా

కాగజ్‌నగర్, మే 1: కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలోని విద్యాధరి ఇంగ్లిష్ మీడియం విద్యాలయంలో ఈనెల 7న శ్రీ మిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి తిరుపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని, ప్రముఖ ఔషధ తయారీ సంస్థ ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ ద్వారా అభ్యాసంతోపాటు ఉపాధి అవకాశాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఫార్మా టెక్నాలజీ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రొడక్షన్ ట్రైనీ హోదాలో ఉద్యోగం కల్పించబడుతుందని, ఉద్యోగం చేస్తూనే టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ టీఐఎస్ఎస్ నుంచి బీఎస్సీ డిగ్రీ ఉచితంగా కంపెనీ ఖర్చులతో పూర్తి చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థి హైదరాబాద్ షాద్‌నగర్‌లో ఉద్యోగం చేయాలని, ప్రతి నెల రూ.15వేల వేతనం పొందవచ్చన్నారు. ఆసక్తి గల విద్యార్థులు టెన్త్, ఇంటర్, ఆధార్ కార్డు, పాన్ కార్డు, 5 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ 6300291926, 6301174316లో సంప్రదించాలన్నారు.

## బాగా చదివి ఉన్నతంగా ఎదగాలి



విద్యార్థులను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

తాండూర్, మే 1 : విద్యార్థులందరూ బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నతమైన స్థాయిలో స్థిరపడాలని అధికారులు, నాయకులు విద్యార్థులకు సూచించారు. పదో తరగతి ఫలితాలలో టాపర్స్‌గా నిలిచిన మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను మండల అధికారులు, నాయకులు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సన్మానించారు. ఇక్కడ తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కుమారస్వామి, డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, ఎంపీవో అనిల్ కుమార్, ఎంఈవో మల్లేశం, ఎవో సుష్మ, హెచ్‌ఎంలు మాసాడి శ్రీరాములు, ఉమాదేవి, ఎం ప్రదీప్, నాయకులున్నారు.

## టాపర్లకు సన్మానం

దండేపల్లి, మే 1: పదో తరగతి ఫలితాల్లో దండేపల్లి మండల టాపర్లుగా నిలిచిన మండలంలోని వెల్గనూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మ్యాన అక్షయ, శ్రీలక్ష్మి, దీక్షితను గురువారం పాఠశాలలో సన్మాన్మించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బిల్లకూరి శంకరయ్య, హెచ్‌ఎం విజయలక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వజ్ర, ఉపాధ్యాయులున్నారు.

## ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, మే 1: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని మండల విద్యాధికారి సుభాష్ తెలిపారు.గురువారం మండలంలోని వివిధ పాఠశాలల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను తన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండి ఉన్నత లక్ష్యాలను ఎంచుకోని చదవాలన్నారు.పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ప్రతిభ కనబరచడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలతో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.